ఆకర్షణీయంగా అంగన్‌వాడీ కేంద్రాలు

బుజ్జాయిలకు ఆటపాటలతో శిక్షణ • చక్కని పౌష్టికాహారం పంపిణీ


ఆటల్లో నిమగ్నమైన చిన్నారులు

అంగన్‌వాడీ కేంద్రాలు ఆకర్షణీయంగా ముస్తాబయ్యాయి. గతంలో శిథిల భవనాల్లో, ఇరుకు గదుల్లో నిర్వహించే ఈ కేంద్రాల రూపురేఖలు మారిపోయాయి. విశాలమైన గదులు, గోడలపై చిన్నారులను ఆకట్టుకునే విధంగా రంగురంగుల బొమ్మలతో ఖరీదైన ప్లే స్కూల్ మాదిరిగా దర్శనమిస్తున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ ప్లే స్కూల్, నర్సరీ, ప్రీ ప్రైమరీ విద్యార్థులకు కల్పించే సౌకర్యాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో సమకూర్చడంతో చిన్నారులు ఆడుతూ పాడుతూ చదువుకుంటున్నారు. అన్ని వసతులతో పక్కా భవనాలు నిర్మించడంతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నారు. వారం పొడవునా చక్కటి మెనూ రూపొందించడమే కాకుండా బలవర్ధక ఆహారాన్ని అందించడంతో చిన్నారులు క్రమం తప్పకుండా కేంద్రాలకు హాజరవుతున్నారు. వాతావరణంలో ఆడుతూ పాడుతూ చదువుకుంటున్నారు. - పెదగంట్యాడ




76వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నం తినిపిస్తున్న టీచర్ సుజాత


77వ వార్డు మహ్మద్ సాహెబ్ పేట అంగన్‌వాడీ కేంద్రంలో..

క్లుప్తంగా

పైడిమాంబ పండగ మహోత్సవం నేడు


పైడిమాంబ అమ్మవారు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో కొలువుదీరిన పైడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు తెలియజేశారు.

చిన్నారులకు మ్యూజికల్ చైర్ పోటీలు


పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

పెదగంట్యాడ: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు సోమవారం మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం చిన్నారులతో కథల పుస్తకాలు చదివించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మాట్లాడుతూ చిన్నారుల్లో మానసిక ఉల్లాసాన్ని రేకెత్తించడానికి ఇటువంటి పోటీలు దోహదం చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

భూలోకమాత ఉత్సవం నేడు


మద్దిలపాలెంలో విద్యుత్ దీపాలంకరణ

మద్దిలపాలెం: జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెం జాతీయ రహదారిపై పెట్రోల్ బంక్ వద్ద గల భూలోకమాత అమ్మవారి వార్షిక పండగల మహోత్సవం మంగళవారం నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా మద్దిలపాలెం ప్రాంతాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించామన్నారు. మంగళవారం ఉదయం నుంచి అమ్మవారి దర్శనం భక్తులకు కల్పిస్తామని చెప్పారు. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయని, భక్తులు పాల్గోవాలని కోరారు.

అన్నమయ్య సంకీర్తనల శిక్షణ ప్రారంభం


మాట్లాడుతున్న జ్యోతిర్మయి

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లోని భక్త తుకారాం ఆలయ ప్రాంగణంలో సోమవారం అన్నమయ్య సంకీర్తన శిక్షణ శిబిరం ప్రారంభమైంది. శ్రీవేంకటేశ్వర స్వామి సంకీర్తనల రాయబారి కొండవీటి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ నెల 24 వరకు శిబిరం కొనసాగుతుంది. ఈ శిక్షణలో పాల్గొన్న సుమారు 100 మందికి అన్నమయ్య సంకీర్తనల గురించి జ్యోతిర్మయి వివరించారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో భక్త తుకారాం విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి జయరాం, జాయింట్ సెక్రటరీ సోమేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధీశాలి.. టంగుటూరి ప్రకాశం

- వర్ధంతి వేళ స్మరించుకున్న వక్తలు
- ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రికి ఘన నివాళి


గ్రంథాలయంలో టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాఠకులు


స్టీల్‌ప్లాంట్ కళాక్షేత్రంలో టంగుటూరి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న జీఎం ఠాగూర్, నాయకులు

ఉక్కునగరం: సైమన్ కమిషన్‌ను ఎదిరించి, తెల్లవారి తుపాకీకి ఎదురొడ్డి నిలిచిన ధీశాలి టంగుటూరి ప్రకాశంపంతులు అని స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్‌డీ విభాగాధిపతి టి.కె.ఎస్.కె.ఠాగూర్ అన్నారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా ఆంధ్ర కేసరి కళాక్షేత్రంలో ఉన్న టంగుటూరి విగ్రహానికి సోమవారం పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేసిన ప్రకాశం పంతులు ఆదర్శనీయులని కొనియాడారు. స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ప్రధానకార్యదర్శి వై.మస్తానప్ప మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటీష్ పాలకుల తుపాకీ గుళ్లకు ఎదురు నిలిచిన నాయకుల్లో ప్రకాశం పంతులు ఒకరన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఎం. పరదేశి, పిట్టారెడ్డి, నల్లమల్లి శ్రీనివాసరెడ్డి, పి.బ్రహ్మయ్య, వి.ఉమాశంకర్, ఎస్.వి.ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ గ్రంథాలయంలో..

పెదగంట్యాడ: స్వాతంత్ర పోరాటంలో అలుపెరగని యోధుడు టంగుటూరి అని గ్రంథాలయ అధికారి పీవీ రమణ అన్నారు. ఆయన త్యాగం, సాహసం భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. ప్రకాశం పంతులు వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

వెంకటాద్రిపై ముగిసిన బ్రహ్మోత్సవాలు


పుష్పయాగం


స్వామివారికి ప్రత్యేక సేవలు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా ముగిసాయి. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామి వారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానం జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి రప్పించిన పలు రకాల పుష్పాలతో పుష్పయాగం చేశారు. స్వామివారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విశేష అర్చనలు, ఊంజల్ సేవ జరిపారు. అనంతరం వేద మంత్రోచ్చరణ నడుమ మహా పూర్ణాహుతితో ఉత్సవాలు ముగిసాయి. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో ఈవో నీలిమ, ఎంఎస్ రాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ చక్రబంధం

- అగనంపూడి హనుమాన్ టెంపుల్ జంక్షన్‌లో నిత్యం సమస్య
- ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ జామ్
- ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటుకు వాహనచోదకుల వినతి


ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు


అగనంపూడి మరిడిమాంబ ఆలయ కూడలి

అగనంపూడి: జాతీయ రహదారి అగనంపూడి హనుమాన్ టెంపుల్ జంక్షన్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కూడలి వద్ద ఎనిమిది నుంచి పది నిమిషాల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకోవల్సి వస్తుండడంతో వాహనచోదకులు హైరానా పడుతున్నారు. గాజువాక, అనకాపల్లి వైపు వెళ్లే మార్గాల్లో రోడ్డు కుదించుకుపోయి ఉండడంతో ట్రాఫిక్‌కు మరింత ఇబ్బంది కలుగుతోంది. గాజువాక వైపు నుంచి వచ్చే ఫార్మా ఉద్యోగుల వాహనాలు, విజయవాడ వైపు వెళ్లే వాహనాలు ఉదయం భారీగా ఉండడంతో వంద నుంచి రెండొందల మీటర్ల వరకు వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. అలాగే ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల సమయంలో అగనంపూడి, లంకెలపాలెం ప్రాంతాల నుంచి ఉద్యోగులు, విద్యార్థులు కూడా ఈ చక్రబంధంలో చిక్కుకుంటున్నారు.

శాఖల సమన్వయంతోనే సమస్య పరిష్కారం

కూడలి వద్ద ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది. దీని వల్ల సిగ్నల్‌తో పనిలేకుండా నేరుగా వెళ్లే వాహనాలు ముందుకు కదిలే అవకాశం ఉంటుంది. కేవలం సిగ్నల్ పాయింట్ వద్ద కుడివైపు రాకపోకలు సాగించే వాహనాలు తప్ప ఇతర వాహనాలు కూడలి వద్ద వేచి ఉండాల్సిన అవసరం ఉండదు. ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఈ సమస్యపై గతంలోనూ సాక్షిలో కథనం వెలువడగా, చర్యలు తీసుకుంటున్నామని అధికారులు అప్పట్లో ప్రకటించారు. కానీ ఆ దిశగా చర్యలు కానరావడం లేదు. జాతీయ రహదారుల సంస్థ, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ, జీవీఎంసీ, పోలీస్ శాఖ సమన్వయంతో వ్యవహరిస్తే తప్ప సమస్య పరిష్కారం అయ్యే అవకాశం కనపడడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైభవంగా తొలేళ్ల సంబరం


అమ్మవార్ల విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో కుంచుమాంబ

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ జంక్షన్‌లోని రెడ్డి కంచరపాలెం ప్రజల ఆరాధ్య దైవాలు కుంచుమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల తొలేళ్ల సంబరం శ్రీరామ సేవా సమాజం ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా జరిగింది. అల్లిపురం, కాన్వెంట్ జంక్షన్, జ్ఞానాపురం, రామ్మూర్తిపంతులు పేట, రెడ్డి కంచరపాలెం, ఊర్వశి కూడలి వరకు అమ్మవారి ప్రతిమలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రతిమను పుట్టబంగారం వద్దకు చేర్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. మంగళవారం అమ్మవార్ల ప్రధాన జాతర నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఐదో పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గ్రామ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అప్పన్న సన్నిధిలో ఏపీ జెన్‌కో ఎండీ


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న చక్రధరబాబు దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం ఏపీ జెన్‌కో ఎండీ చక్రధరబాబు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

ఆహ్లాదం పంచేలా..

దీపాంజలి నగర్‌లో పార్కుల అభివృద్ధి



దీపాంజలినగర్ వాసుల కోసం సరోవర్


జీఎం గెస్ట్‌హౌస్ సమీపంలో పార్క్

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఉద్యోగుల కుటుంబాలు నివసించే 'దీపాంజలినగర్ టౌన్‌షిప్'ను యాజమాన్యం ఆహ్లాదకరంగా తీర్చిదిద్దింది. ఇక్కడ వారికి అవసరమైన వసతులు కల్పించింది. ఆహ్లాదంతో పాటు ఆనందం పంచేలా పార్క్‌లు అభివృద్ధి చేసింది. దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో ఏబీసీడీ టైపుల వారీగా నిర్మించిన 1100 ఇళ్లలో సుమారు 2500 మంది నివాసం ఉంటున్నారు. వీరి కోసం టౌన్‌షిప్‌లో పూల మొక్కలతో అందంగా తీర్చిదిద్దిన పార్క్‌లు టౌన్‌షిప్ వాసులతో పాటు సందర్శకులను కూడా మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి.

కల్పించిన వసతులు

- దీపాంజలి నగర్ టౌన్‌షిప్ ప్రధాన ద్వారం మొదలుకొని టౌన్‌షిప్‌లో అన్ని రోడ్ల వెంబడి రకరకాల పూల మొక్కలు నాటారు.
- ఎన్టీపీసీ సందర్శన కోసం వచ్చే ప్రత్యేక అతిథుల కోసం టౌన్‌షిప్‌లో సకల సదుపాయాలతో సముద్రిక, శారద అతిథి గృహాలు ప్రత్యేక ఆకర్షణీయంగా నిలుస్తున్నాయి. సుందర వనాలు అతిథులను కట్టి పడేస్తున్నాయి.
- దీపిక లేడీస్ క్లబ్ సముదాయంలోని పార్క్‌లో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు బాలలను ఆకర్షిస్తున్నాయి.
- షాపింగ్ కాంప్లెక్సుకు రాకపోకలు సాగించే వారి కోసం రకరకాల పూల మొక్కలతో పార్క్ ఏర్పాటు చేశారు.
- దీపాంజలినగర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సింహాద్రి సరోవర్ చుట్టూ సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు చెరువు మధ్యలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. సింహాద్రి సరోవర్ సందర్శకులు బోటు షికారుతో ఉత్సాహంగా గడుపుతున్నారు.
- దీపిక లేడీస్ క్లబ్ సముదాయంలోని చిల్డ్రన్ పార్క్‌లో ఏర్పాటు చేసిన సోలార్ ట్రీ ఆకట్టుకుంటుంది. టౌన్‌షిప్‌లో ఎటు చూసిన పూల తోటలు, ప్రత్యేక గార్డెన్లు చూపరులకు మంచి అనుభూతి, ఆహ్లాదాన్ని కలుగజేస్తున్నాయి.


దీపాంజలి నగర్ ముఖద్వారం

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి


జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేన పూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ,

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు

యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్ర నామార్చన ఘనంగా జరిగింది. 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠంపజేసి అష్టోత్తరంపూజ నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దుదాం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్ : వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను ఉపయోగించి నగరంలో కాలుష్యాన్ని అరికట్టేందుకు, విశాఖను కాలుష్యరహితంగా తీర్చిదిద్దేందుకు నగర ప్రజలు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు. తన బంగ్లా నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సోమవారం ఆయన సైకిల్‌పై చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను ఉపయోగించాలనే నిర్ణయం మేరకు అధికారులు, సిబ్బంది ప్రజా రవాణాను ఉపయోగిస్తున్నారన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సహకరించాలని కోరారు.

భాషా ప్రావీణ్యంపై ముగిసిన వర్క్‌షాప్


గోపికుమార్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: సంస్కృతం, హిందీ, తెలుగు భాషల ప్రావీణ్యంపై ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యా పరిషత్‌లో నిర్వహించిన ఉచిత వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. 'ఎన్‌రిచింగ్ హ్యూమన్ వాల్యూస్ త్రూ లాంగ్వేజ్ లెర్నింగ్ ' పేరిట ఈ నెల 14న వర్క్‌షాప్ ప్రారంభించిన విషయం తెలిసిందే. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథి సాంఖ్య టెక్నాలజీస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.గోపికుమార్ మాట్లాడుతూ ప్రపంచ విజ్ఞానానికి సంస్కృత భాష ముఖద్వారంగా నిలుస్తుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించిన వికసిత్ భారత్ లక్ష్యం.. భాషల ద్వారానే సుసాధ్యమవుతుందన్నారు. గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.ఎస్.బోస్ మాట్లాడుతూ మానవీయ విలువలకు భాషలే మూలాధారంగా నిలుస్తాయన్నారు. సమాజంలో విలువలు పెంచే దిశగా ప్రతి ఒక్కరూ వారి వారి బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. అనంతరం గోపికుమార్‌ను కళాశాల ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో ఆచార్య అయ్యగారి ఆనంద్, డాక్టర్ వారణాసి వెంకటేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.